క్లుప్తంగా

912 మందికి మధుమేహ పరీక్షలు



పాన్‌గల్: మండలంలో షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న మధుమేహ పరీక్షలు కొనసాగుతున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గోప్లాపూర్‌లో కొనసాగుతున్న పరీక్షలను సీహెచ్‌ఓ రామయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లు దాటిన వారందరూ పరీక్షలు చేయించుకొని సిబ్బందికి సహకరించాలని కోరారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో సిబ్బంది 912 మందికి పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నర్సమ్మ, నాగేశ్వరి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలో విద్యార్థుల ప్రతిభ



కొత్తకోట: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 1, 2వ తేదీల్లో నిర్వహించిన 13వ ఓపెన్ స్టేట్ లెవల్ తైక్వాండో చాంపియన్‌షిప్ టోర్నమెంట్ స్థానిక విద్యార్థులు ప్రతిభ చాటారు. కొత్తకోటతో పాటు మండలంలోని అగ్రహారం, పాలెం, కనిమెట్ట, మోజర్ల గ్రామాలకు చెందిన మొత్తం 40 మంది విద్యార్థులు పాల్గొన్నారని కోచ్‌లు శివశంకర్, రవి, పరశురాం తెలిపారు. దీనిలో భాగంగా తైక్వాండో పోటీలో విద్యార్థులు 5 బంగారు పతకాలు, 15 సిల్వర్ మెడల్స్, 10 బ్రౌంజ్ మెడల్స్ సాధించారని కోచ్‌లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా మెడల్స్‌ను అందుకున్నారు. విద్యార్థులను సీనియర్ మాస్టర్లు పెంటన్న, నరేందర్‌సాగర్, శ్రీను, సంతోష్, నరేష్ నాయుడు, రమేష్‌రెడ్డి, మాధవ్, శివయ్య, యాదగిరి అభినందించారు.

ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించి రాయితీ పొందండి

ఆత్మకూర్: ఇంటి స్థలాల యజమానులు మార్చి 31వ తేదీ లోపు ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించి 25 శాతం రాయితీ పొందాలని పురపాలిక కమిషనర్ చికిని శశిధర్ తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి వివరాలు వెల్లడించారు. 2020లో రూ.వెయ్యి చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్‌కు దరకాస్తులు చేసుకున్న ప్లాట్ల యజమానులు ఆన్‌లైన్‌లో నిర్ధేశించిన రుసుం చెల్లించాలని, ఏవైనా అనుమానాలు ఉంటే కార్యాలయంలో హెల్ప్ డెస్క్ 95026 39749 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

నేడు ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన

కొత్తకోట రూరల్: వనపర్తి మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆధ్వర్యంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కల్పించనున్నట్లు కొత్తకోట మున్సిపల్ కమిషనర్ సైదయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని ప్రముఖులు, రియల్ వ్యాపారులు, ప్రజలు పాల్గొని ఎల్‌ఆర్‌ఎస్‌పై ఉన్న సందేహాల గురించి నివృత్తి చేసుకోవాలని కమిషనర్ కోరారు.

దళితులకు సీట్లు కేటాయించాలి



ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో రెండు వేలు జనాభా కలిగిన దళితులకు రెండు కౌన్సిలర్ సీట్లను కేటాయించాలని ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు డాక్టర్ కృష్ణ అన్నారు. సోమవారం దళితులతో కలిసి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. రెండు సీట్లు కేటాయించాల్సి ఉండగా ఒక్క సీటు కూడా కేటాయించక పోవడంతో దళితులకు అన్యాయం జరిగిందన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా రెండు సీట్లను కెటాయించి దళితులకు న్యాయం చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు.

ప్రైవేట్‌కు దీటుగా రాణించాలి

- ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు
- డీఐఈఓ అంజయ్య



ఆత్మకూర్‌లో విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న డీఐఈఓ అంజయ్య

ఆత్మకూర్: ప్రభుత్వ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు బాగా చదివి ఈ నెల 5 నుంచి జరిగే వార్షిక పరీక్షల్లో ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలను సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య అన్నారు. డీఐఈఓ సోమవారం కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్నివిధాల చర్యలు తీసుకుంటున్నామని, కేంద్రాల్లో వసతులు సిద్ధం చేశామన్నారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు కురుమూర్తి తన సొంత ఖర్చులతో రూపొందించిన ఎంసెట్ మ్యాథ్స్, సైన్స్, టీటీసీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందని కురుమూర్తిని డీఐఈఓ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భాగ్యవర్ధన్ రెడ్డి, అధ్యాపకులు టీజే విశ్వేశ్వర్, సునీల్‌కుమార్‌రెడ్డి, కురుమూర్తి, జమ్మన్న, రాఘవేందర్‌రావు, వీణ, లలితమ్మ, చైతన్యారాణి, పావని, రాఘవేందర్, బాలకృష్ణ, బుచ్చయ్య, రామన్‌గౌడ్, సతీష్‌కుమార్, విమల, అనీత, బోధనేతరసిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పాన్‌గల్: ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు కొనసాగునున్న ఇంటర్ పరీక్షలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ సుదర్శన్ రెడ్డి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు సోమవారం పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష కేంద్రం ఆవరణలో ఐదు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి.. వాటిని మొదటిసారిగా ఇంటర్‌బోర్డు ప్రధాన కార్యాలయానికి అనుసంధానిస్తున్నారు. బోర్డు అధికారులు అక్కడి నుంచి అన్ని పరీక్ష కేంద్రాలను పర్యవేక్షిస్తారన్నారు. ప్రశ్నాపత్రం ఏ సమయంలో తెరిచారు? సిబ్బంది ఏం చేస్తున్నారు? కేంద్రంలోకి వచ్చి వెళ్లేవారిపై నిఘా పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రం చిరునామా సులువుగా గుర్తించేందుకు హల్‌టికెట్‌పై ఈ సారి క్యూర్ కోడ్‌ను ముద్రిస్తున్నారు. దానిని సెల్‌ఫోన్‌లో స్కాన్ చేయగానే పరీక్ష కేంద్రానికి సంబంధించి పూర్తి వివరాలు సెల్‌ఫోన్‌లో వస్తాయి. ఈ పరీక్ష కేంద్రంలో ప్రథమ సంవత్సరంలో 91 మంది, ద్వితీయ సంవత్సంలో 108 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు.



పాన్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

అట్టహాసంగా ఎద్దుల గిరక పోటీలు



గిరకలాగుడు పోటీల్లో పాల్గొన్న ఎద్దులు

ఆత్మకూర్: పట్టణ శివారులోని పరమేశ్వరస్వామి జాతర సందర్భంగా సోమవారం నిర్వహించిన ఎద్దుల బండ్ల గిరక లాగుడు పొటీలు అట్టహాసంగా కొనసాగాయి. 300 మీటర్ల పందెంలో రైతు ఆకుల నరేష్‌కు చెందిన ఎద్దులు 24 సెకన్లలో లాగి మొదటి విజేతగా నిలిచాయి. 41 సెకన్లు లాగి లంకాల లచ్చన్న ఎద్దులు రెండో బహుమతి, బోయ సత్యన్న ఎద్దులు 59 సెకన్లలో లాగి మూడో స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5వేలు, మూడో బహుమతి రూ.3 వేలు నగదును అందజేశారు.

కబడ్డీ విజేత మూలమళ్ల

జాతర సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో మొత్తం 40 జట్లు తలపడగా మూలమళ్ల ఏ టీం మొదటి బహుమతిని సాధించి విజేతగా నిలిచింది. రెండో బహుమతి భీంపురం, మూడో బహుమతి కంచిరావుపల్లి, నాల్గో బహుమతిని మూలమళ్ల బీ టీంలు సాధించాయి. మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాల్గో బహుమతి రూ.5 వేలు నగదుతో పాటు షీల్డులను విజేతలకు అందజేశారు. అలాగే స్లో బైక్ పోటీలు నిర్వహించగా.. గోవర్ధన్ విజేతగా నిలిచారు. నాయకులు, నిర్వాహకులు రహ్మతుల్లా, వెంకటనర్సింహారావు, సాయిరాఘవ, మణివర్ధన్‌రెడ్డి, యాదగిరిశెట్టి, తెలుగు నగేష్, అక్షర నగేష్, మహేష్, దామోదర్, శివ, కుర్ని రవికాంత్, క్రీడాకారులు, స్థానికులు ఉన్నారు.

'మహిళా దివ్యాంగులకు రక్షణ కరువు'



వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని ఎన్‌పీఆర్‌డీ భవనంలో సోమవారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మహిళా విభాగం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ జిల్లా మహిళా విభాగం కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పి.భాగ్యలక్ష్మి, కో కన్వీనర్లుగా ఎ.లక్ష్మి, కె.లక్ష్మి, రాధిక, మంగమ్మ, కె.భాగ్యలక్ష్మి, కమిటీ సభ్యులు కృష్ణవేణి, యాదమ్మ, నాగమ్మ, అనిషాబేగం, వెంకటమ్మ, పార్వతి, జ్యోతిని నియమించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ మహిళా దివ్యాంగులపై సమాజం చిన్నచూపు చూస్తుందని వాపోయారు. లైగింక వేధింపులు, అత్యాచారాలు పెరిగిపోతున్నా వాటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలం చెందుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా దివ్యాంగులకు భరోసా కల్పించేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పెన్షన్ రూ.6 వేలకు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు దివ్యాంగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

గ్రామ సమస్యలపై నిరంతరం పోరాడుదాం



పాంరెడ్డిపల్లిలో మురుగుకాల్వ దుస్థితిని చూపిస్తున్న సీపీఎం నాయకులు

అమరచింత: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తున్నామని సీపీఎం మండల నాయకులు వెంకటేష్, అజయ్ అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు గ్రామ సమస్యలపై పార్టీ పరంగా సర్వే చేపడుతున్నామన్నారు. మార్చి చివరి నాటికి సమస్యలపై సర్వే నిర్వస్తామని తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో సోమవారం కాలనీల్లో తిరుగుతూ సమస్యలు గుర్తించారు. గ్రామంలో స్కూల్ గ్రౌండ్‌లో ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుందని నూతన వాటర్ ట్యాంకు నిర్మించాలని కోరారు. సీసీ రహదారుల సమస్య వేధిస్తున్నా అధికారులు, గత పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గ్రామంలో డ్రైయినేజీల నిర్మాణం లేకపోవడంతో మురుగు రహదారులపై పారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాలు ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసరా పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు సమీపంలోని అమరచింతకు వెళ్లాల్సిన పరిస్థితి కల్పించడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామ సమస్యలను పరిష్కరించాలంటూ ఈనెల 6న పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర్, మహేష్, మోహన్, అంజిరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిషేధించాలి

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో, హైవే పక్కన గల దాబాల్లో అక్రమంగా మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నారని, బెల్టు (మద్యం) షాపులను వెంటనే నిషేధించాలంటూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు యుగంధర్‌యాదవ్ సోమవారం కొత్తకోట తహసీల్దార్ వెంకటేశ్వర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా హైవే వెంట ఉన్న దాబాలతో పాటు గ్రామాల్లో విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, దీంతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతే కాకుండా కొన్ని గ్రామాల్లో వేలం వేసి మరీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని సంబంధిత అధికారులకు తెలిసినా తెలియనట్టుగా వ్యవహరిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. బెల్ట్ షాపులను వెంటనే మూసి వేయించకుంటే బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు.

అభివృద్ధి పనులకు ఇసుక అనుమతులు ఇవ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: మండలంలో రూ.కోటి నిధులతో గ్రామాల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ఇసుకకు అనుమతులు ఇవ్వాలని తహసీల్దార్ చాంద్‌పాషాకు కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. సీసీరోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇసుక లభించడం లేదని, అనుమతులు ఇచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరమేష్, తులజీరాజ్‌యాదవ్, నాయకులు సతీష్, కుర్మన్న, మణ్యం , వెంకటేష్ తదితరులు ఉన్నారు.

హరహర మహాదేవ.. శంభో శంకర



స్వామివారి పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు



కోలాటం ఆడుతున్న కళాకారులు



స్వామివారికి దాసంగాలు పెడుతున్న భక్తులు

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువు మధ్యలో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి జాతరలో భాగంగా సోమవారం రాత్రి మూడో రోజు భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ, పూజలు, రథోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాది మంది భక్తులు బక్షాలు, పచ్చిపులుసు, అన్నంతో దాసంగాలు పెట్టి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ప్రముఖ పూజారి కర్పసయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతర కమిటీ కన్వీనర్ వెంకటనర్సింహారావు, నిర్వాహకులు సాయిరాఘవ, మణివర్ధన్‌రెడ్డి, యాదగిరిశెట్టి, తెలుగు నగేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పిన్నంచర్ల గ్రామస్తుల భజన, పల్లెకోళ్ల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ..

సోమవారం రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకొని పట్టణంలోని పుర వీధుల గుండా మేళతాళాలతో స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. రథోత్సవంపై పరమేశ్వరస్వామి విగ్రహాలు ఉంచి రథోత్సవం చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. జాతర మైదానంలో వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, రవికాంత్, నాగేష్, పరమేష్, తులసీరాజ్, శ్రీను, దామోదర్, మహేష్ తదితరులు ఉన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

వనపర్తి రూరల్: ఆత్మకూర్ మండల కేంద్రంలోని బాబా కాలనీలో టీఎన్‌జీఓ భవనం పక్కన ఉన్న 20 ఫీట్ల రోడ్డును బంగారం శ్రీనివాసులు ఆక్రమించి షాపులను నిర్మిస్తున్నారని మున్సిపల్ కమిషనర్, టీపీఓకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని, కబ్జాలపై ప్రత్యేక కమిషన్ వేసి విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ ఆదర్శ్‌సురభికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 రోజుల పాటు నిర్మాణాలు ఆపాలని, ఆక్రమణదారుడిపై చర్య తీసుకోవాలని ఆత్మకూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేస్తున్నా అధికారుల నుంచి స్పందనలేదని వాపోయారు. ఆత్మకూర్‌లో ప్రైవేట్ వెంచర్లు వేసినప్పుడు 10 శాతం భూమిని ప్రజల సౌకర్యం కోసం ఖాళీగా ఉంచగా.. వాటిని సైతం కొందరు కబ్జా చేసిన భూములను సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీనికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలకృష్ణ, శ్రీహరి, లక్ష్మీనారాయణ, చిన్నకురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో నిలిచిన మురుగు



బాలుర ఉన్నత పాఠశాలలో నిలిచిన మురుగు నీటిలోనే విద్యార్థులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో తాగునీటి కుళాయిల సమీపంలో మురుగు నిలవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవడం, ప్లేట్లు కడిగిన నీరు బయటకి వెళ్లకపోవడంతో ఆ నీటిలోనే విద్యార్థులు నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. మురుగు నీరు బయటికి వెళ్లే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. ఆ నీటిలోనే విద్యార్థులు నడుస్తూ కుళాయిల వద్ద చేతులు శుభ్రం చేసుకుంటున్న దృశ్యాలు సోమవారం 'సాక్షి' క్లిక్ అనిపించింది.

ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

వీపనగండ్ల: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యకర్తలతో కలిసి గోపల్‌దిన్నె ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా.. ముగ్గురు మాత్రమే ఉన్నారని, ఇదే పాఠశాలలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించకపోవడంతో చిన్నారులు చాలీచాలని వసతులలోనే విద్య అభ్యసిస్తున్నారన్నారు. మండలంలోని పలు గ్రామాల పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి వసతులు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలో కనీస వసతులు కల్పించకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులను ఏకం చేసి ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పోగుల వెంకటయ్య, రంగస్వామిగౌడ్, కిరణ్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన



ప్రార్థనలో పాల్గొన్న ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచే విధంగా బోధన చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని మాధరావుపల్లి, శాగాపూర్‌తండా కేతేపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థి, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పక రావాలన్నారు. మాధరావుపల్లి ప్రాథమిక పాఠశాలలో దాతల సహకారంతో రకరకాల వర్ణ చిత్రాలతో సుందరీకరణ అద్భుతంగా ఉందని ఎంఈఓ పేర్కొన్నారు.

గ్రామకంఠం స్థలం కాపాడాలని యువకుడి నిరసన



ప్లకార్డుతో కమిషనర్‌కు సమస్యను విన్నవిస్తున్న రాజు

అమరచింత: పట్టణంలోని గ్రామకంఠం స్థలాన్ని కొంతమంది కబ్జా చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ పట్టణానికి చెందిన రాజు ప్లకార్డుతో మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. పట్టణంలోని అప్పటి గ్రామకంఠం స్థలాన్ని స్వచ్ఛంద సంస్థ పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దీంతో ఎంతో విలువైన స్థలం అన్యాక్రాంతం కావడంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశాడు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారనే విషయంపై గతేడాది కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని.. విచారణ చేపట్టిన అప్పటి కలెక్టర్ కబ్జా చేసి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలంలో ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. దీంతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలంతో పాటు ఇతర ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో నిరసన చేపట్టినట్లు రాజు తెలిపాడు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రవిబాబు మాట్లాడుతూ సమస్య గురించి వినతి పత్రం అందిస్తే సమస్య గుర్తించి ఉన్నతాధికారులకు విన్నవించే అవకాశం ఉందన్నారు. గతంలో జరిగిన విషయాలను సిబ్బందితో తెలుసుకుని ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు తన వంతు చర్యలు తీసుకుంటామన్నారు.

'విద్యార్థులకు సమస్యలు రానియొద్దు'



ఉపాధ్యాయులకు మెటీరియల్ అందిస్తున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట: విద్యార్థులకు ఎటువంటి సమస్యలు రాకుండా చూడాలని, పాఠశాలలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని తిర్మలాపురం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో మెనూ పాటిస్తున్నారా అనే విషయం అడిగి తెలుసుకున్నారు. వంటగది, కూరగాయలు, బియ్యం నిల్వ ఉండే గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు సైన్స్, మాథ్స్‌లో ప్రతిభ పెంచుకునేందుకు ప్రత్యేక పుస్తకాలు విద్యార్థులకు అందించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆ తర్వాత వెటర్నరీ ఆస్పత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బాలీశ్వర్, పర్వతాలు యాదవ్, లోకేశ్వర్ ఉన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు



మాట్లాడుతున్న న్యాయమూర్తి రజిని

కొత్తకోట రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి.రజిని అన్నారు. సోమవారం కొత్తకోటలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలల్లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రపతి ద్రౌపతిముర్మును ఆదర్శంగా తీసుకొని మహిళలు అత్యున్నతమైన స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల బాలికలు, మహిళలకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచిత న్యాయ సేవలు అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహాల నివారణ చట్టం, పోక్సో యాక్ట్, బాల కార్మికుల చట్టం, మోటార్ వెహికల్ చట్టం గురించి వివరించారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు. ఎంఈఓ కృష్ణయ్య, డిప్యూటీ లార్స్ జి.ఉత్తరయ్య, ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
వనపర్తి | ఎం. జగదీశ్వర్ | - 9912370010
కొత్తకోట / పెబ్బేర్ | ఇ. రాజశేఖర్ గౌడ్ | - 97000 09392
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్
9951602829
జబ్బర్ లాల్ : 9553955603